ఎర్రబందకు పదేళ్లకు ఆర్టీసీ బస్సు



బస్సు సర్వీసు ప్రారంభంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

చింతపల్లి, న్యూస్‌టుడే: ఒకటి, రెండు కాదు.. ఏకంగా పదేళ్ల తరువాత ఆ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసు కల్పించడంతో చింతపల్లి మండలం ఎర్రబొమ్మలు పంచాయతీ ఎర్రబంద గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ఉన్న ఎర్రబొమ్మలు పంచాయతీ ఎర్రబంద, కొమ్మంగి పంచాయతీ కేంద్రాలకు నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు తిరిగేవి. రహదారి బాగోలేదంటూ కాలక్రమంలో ఆ సర్వీసులను అధికారులు నిలిపేశారు. దాదాపు పదేళ్ల తరువాత కూటమి ప్రభుత్వం మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలని నిర్ణయించింది. దీంతో కొమ్మంగి, ఎర్రబంద గ్రామాలకు పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ సర్వీసు శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు, సర్పంచి లోతా పండయ్య, తెదేపా నాయకులు బేరా సత్యనారాయణపడాల్, కాఫీ సంక్షేమ సంఘం నాయకులు సెగ్గె కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ సేవలు విస్తరిస్తాం..
జీవనోపాధికి దారి చూపుతాం

అరకు కాఫీ, జీసీసీ ఉత్పత్తుల స్టాళ్లకు ఫ్రాంఛైజీలిస్తాం
'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్'తో ఎండీ కల్పనాకుమారి

–ఈనాడు, పాడేరు, న్యూస్‌టుడే, పెదవాల్తేరు

'అరకు కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. ప్రధాని మోదీ మన్‌కీబాత్‌లో ఈ కాఫీ గొప్పతనం ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు కూడా అరకు కాఫీ, తోటల విస్తరణపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో జీసీసీ సేవలు మరింత విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తున్నాం. వాటితో గిరిజనుల జీవనోపాధి మెరుగవుతుంద'ని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఎండీ కల్పనాకుమారి వెల్లడించారు. అటవీ ఉత్పత్తుల సేకరణ నుంచి వాటి బ్రాండింగ్, మార్కెటింగ్ వరకు తీసుకువస్తున్న మార్పుల గురించి 'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్'కు ఆమె వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..



కల్పనాకుమారి, జీసీసీ ఎండీ



ఆకర్షణీయ ప్యాకింగ్‌లో..

జీసీసీ లోగో నుంచి ప్యాకింగ్ వరకు అన్నింటిని మార్పులు చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయిలో ఆకట్టుకునేలా ఆకర్షణీయంగా జీసీసీ ఉత్పత్తుల ప్యాకింగ్ ఉండబోతోంది. ఈ మేరకు మార్కెటింగ్ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. త్వరలోనే సరికొత్త ప్యాకింగ్‌తో కాఫీ, తేనె, పసుపు, చింతపండు, సబ్బులు, షర్బత్, నన్నారీ ఇలా 50 రకాలపైగా మా ఉత్పత్తులు మార్కెట్‌లోకొస్తాయి.

మరిన్ని రుచుల్లో కాఫీ



జీసీసీ నుంచి అరకు కాఫీ అమ్మకాలకు ఫ్రాంఛైజీలు ఇవ్వనున్నాం. అన్నిచోట్లా ఒకేలా ఏర్పాటు చేసేలా ఓ నమూనాను తయారు చేస్తున్నాం. వీటి కోసం ముందుకొచ్చేవారికి అరకు కాఫీ తయారీపై శిక్షణ ఇస్తాం. ఇప్పటికే విశాఖతో పాటు రాష్ట్రంలోని ముఖ్య ప్రాంతాల నుంచి ఫ్రాంఛైజీలు కోసం చాలామంది సంప్రదిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌స్టెంట్, ఫిల్టర్ కాఫీలు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో మరిన్ని రుచుల్లో కాఫీని తీసుకువచ్చే విధంగా డికెఫేనేటెడ్ కాఫీని తీసుకురావాలనే ఆలోచనతో ఉన్నాం. మార్కెటింగ్ కోసం పొరుగుసేవల ద్వారా సిబ్బందిని నియమించుకుంటాం.

స్థానికంగానే ప్రాసెసింగ్ యూనిట్లు..

ఇదివరకు కాఫీ, ఇతర అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని శుద్ధి చేయడానికి, విలువ జోడించడానికి ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నాం. ఇకపై స్థానికంగానే వాటిని ప్రాసెస్ చేయాలని నిర్ణయించాం. అనకాపల్లి సమీపంలో కొత్తగా కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయబోతున్నాం. వచ్చే అయిదేళ్లలో 8 వేల టన్నుల నుంచి 10 వేల టన్నుల సరకు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ ఏడాది నుంచే 2000 వేల టన్నుల సేకరణ మొదలుపెడుతున్నాం. కాఫీతో వివిధ ఉత్పత్తులను తయారు చేయాలనే ఆలోచన ఉంది. రంపచోడవరంలో ఇటీవల మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ పెట్టాం. ఈ నెలాఖరులోగా వినియోగంలో తెస్తాం. పసుపు పంటకు విలువ జోడించి మార్కెటింగ్ చేస్తాం.

పారదర్శకతకు పెద్దపీట..



జీసీసీ ద్వారా ఏటా రూ.500 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. కాకపోతే సిబ్బంది, ఉద్యోగుల్లో జవాబుదారీతనం లోపించడంతో కొన్నిచోట్ల అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని జీసీసీ లావాదేవీలు మొత్తం ఆన్‌లైన్ చేయనున్నాం. ఏరోజు ఎక్కడ ఎంత అమ్మకాలు జరిగాయి?, నగదు జమైందా?, నిల్వలు ఎంతున్నాయి.. లాంటి సమాచారం క్షణాల్లో తెలుసుకునే ఏర్పాటు చేస్తున్నాం. జీసీసీలో ఖాళీ పోస్టులను డిప్యుటేషన్ల ద్వారా భర్తీ చేస్తున్నాం. ఇది వరకు అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేశాం. బాధ్యులుగా గుర్తించిన కొంతమంది నుంచి రికవరీలు చేశామ'ని ఎండీ కల్పనాకుమారి తెలిపారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చర్యలు తప్పవు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కడైనా బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్, బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలన కమిటీ ఛైర్‌పర్సన్ కల్పశ్రీ హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనపై శుక్రవారం సమీక్ష సమావేశం జరిగింది. సీడీపీవో సంధ్యారాణి, ఏడీఎంహెచ్‌వో డాక్టరు శిరీష, ఎంఈవో రామకృష్ణ, సీఐ రవికుమార్, ఏటీడబ్ల్యూవో రామతులసి, వెలుగు డీపీఎం పరమేశ్వరరావు తదితరులతో సబ్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్ల వయస్సు నిండకుండా పెళ్లి చేస్తే తల్లిదండ్రులతోపాటు వివాహాలను ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే సమీపంలోని అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాలు, పోలీసుల్లో ఎవరికైనా సమాచారం అందజేయాలని సూచించారు. 100, 109, 1098 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోను చేయొచ్చన్నారు. ఈ సమావేశంలో హెల్త్ మానిటరింగ్ సెల్ అధికారి ఝాన్సీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.





బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

అల్లూరి ఉద్యానాన్ని అభివృద్ధి చేయరూ!



గూడెంకొత్తవీధి మండలం ధారాలమ్మ ఘాటీలో ధారాలమ్మ ఆలయం వద్ద అల్లూరి ఉద్యానం గతనెలలో సంభవించిన తుపానుకు కళావిహీనంగా మారింది. ఈ ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న సాగిన నారాయణమూర్తి.. భక్తుల నుంచి విరాళాలు సేకరించి ఆలయం దిగువ భాగంలో జలపాతం వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేయించారు. దేవతా మూర్తుల విగ్రహాలు, దూరప్రాంతాల నుంచి వచ్చే వారు విశ్రాంతి తీసుకోవడానికి షెడ్డు నిర్మించారు. భక్తులు, పర్యటకులు ఇక్కడ సేదతీరేవారు. గత నెల 8న సంభవించిన తుపానుకు ఈప్రాంతానికి పెద్దపెద్ద బండరాళ్లు దొర్లి వచ్చాయి. అధికారులు స్పందించి ఈ పార్కును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. – సీలేరు, న్యూస్‌టుడే

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతాం

పాడేరు, న్యూస్‌టుడే: మీ కోసంలో వచ్చిన ప్రతి అర్జీ పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ ఆదేశించారు. శుక్రవారం పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీఏ పీఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్‌ఓ పద్మావతితో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా 154 వినతులు అందాయి. పాడేరు మండలం గొండెలి పంచాయతీ బి.తాడేపుట్టు గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించాలని గ్రామస్థురాలు పి కళావతి వినతిపత్రం సమర్పించారు. తోటపుట్టు, తలాబుతోట గ్రామాల్లో పాఠశాల భవనాలు, కొత్త సుజనకోటలో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని ముంచంగిపుట్టు మండలం సుజనకోట సర్పంచి వి.రమేష్ వినతిపత్రం సమర్పించారు. డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు పంచాయతీలో 15 పీవీటీజీ కుటుంబాలకు పీఎంజన్‌మన్ ఇళ్లు మంజూరు చేయాలని బి జగబంధు, ఎస్.రాజకుమార్ వినతిపత్రం అందజేశారు. డుంబ్రిగుడ మండలం తూటంగి పంచాయతీ జర్రాయి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలని మాజీ సర్పంచి కె.సుబ్బారావు కోరారు. జి.కె.వీధి మండలం జర్రెల పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ పథకంలో చేపట్టిన తాగునీటి పథకాలు పూర్తిచేయాలని ఎల్.మత్స్యరాజు, బాలరాజు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, పంచాయతీరాజ్ ఈఈ టి.కొండయ్యపడాల్, జిల్లా వ్యవసాయాధికారి నంద్, జిల్లా వైద్యాధికారి జమాల్ బాషా, జిల్లా పంచాయతీ అధికారి లవరాజు, డీడీ ఇన్‌ఛార్జి రజని తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీఓ అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఐటీఐ, డిప్లమో ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న దివ్యాంగ అభ్యర్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖాధికారిణి జె.మాధవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనీసం 40 శాతం దివ్యాంగత్వం కలిగి ఉన్నవారు అర్హులన్నారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3 లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోషకాల బియ్యం.. మరో నాలుగేళ్లు ఉచితం!



పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం నిర్ణయం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

ఆహార భద్రత చట్టంలో భాగంగా పేదలకు అందిస్తున్న పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ మరో నాలుగేళ్లు పొడిగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. కొవిడ్ విపత్కర పరిస్థితుల సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా ప్రతి నెలా కార్డులోని ఒక వ్యక్తికి అయిదు కేజీల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. తొలుత నిర్ణయించిన ప్రకారం ఈ ఏడాది డిసెంబరు 31తో ఈ పథకం గడువు ముగియనుంది. ఈ గడువును 2028 సంవత్సరాంతం వరకు పొడిగిస్తూ తాజాగా నిర్ణయం తీసుకోవడంతో పేదల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



అల్లూరి జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని మొత్తం 352 పంచాయతీల్లో 2,98,092 మంది రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం నిత్యావసర సరకులు అందిస్తోంది. 221 ఎండీయూ వాహనాల ద్వారా పీఎంజీకేఏవైలో భాగంగా జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలో ఉన్న కార్డులకు కేంద్రం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. మిగిలిన కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ భరిస్తోంది. ప్రస్తుతం కొవిడ్ తగ్గుముఖం పట్టినా అధిక వర్షాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా గ్రామీణ ప్రాంతాలు ఇబ్బందుల్లో ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత బియ్యం పంపిణీ కొనసాగించేందుకు సంయుక్తంగా నిర్ణయించాయి. దీంతో అల్లూరి జిల్లాలోనూ మరో నాలుగేళ్లు పేదలకు పోషకాలతో కూడిన బియ్యం ఉచితంగా అందనుంది.

ఫోర్టిఫైడ్‌లో ఉండే పోషకాలివే..

రేషన్ బియ్యం అంటే నాణ్యత ఉండవని, వాటిని అధిక శాతం మంది తినేందుకు ఇష్టపడేవారు కాదు. సార్టెక్స్ బియ్యంలో 15 శాతం, నాన్ సార్టెక్స్‌లో 25 శాతం వరకు నూకలు ఉంటాయి. దీంతో ఈ బియ్యాన్ని అతి తక్కువ మంది మాత్రమే తినేవారు. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రేషన్‌లో ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించింది. దీంతో గత ఏడాది సెప్టెంబరు నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ ప్రారంభించారు. వంద కేజీల సార్టెక్స్ బియ్యంలో యంత్రాలతో కిలో కెర్నల్ (పోషకాహారం) కలిపి పంపిణీ చేస్తున్నారు. ఇందులో విటమిన్ బి-12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ మెండుగా ఉండటంతో పోషకాలు అందుతున్నాయి. పాలిష్ చేసిన బియ్యం కంటే ఇవే మేలని అధికశాతం మంది వీటిని తినేందుకు ఇష్టపడుతున్నారు.

గడువు పొడిగింపు

ఉచిత బియ్యం పంపిణీ గడువు ఈ ఏడాది డిసెంబరు 31 వరకు మాత్రమే ఉండేది. దీనిని 2028 వరకు పెంచారు. కార్డుదారులందరికీ పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తున్నాం. వీటిని దళారులకు విక్రయించకుండా గిరిజనులు, కార్డుదారులు వినియోగించుకోవాలి.
– గణేష్‌కుమార్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

జిల్లాలో కార్డులు, లబ్ధిదారుల వివరాలు

డివిజన్	అన్నపూర్ణ	ఏఏవై కార్డులు	లబ్ధిదారులు	తెల్లరేషన్ కార్డులు	లబ్ధిదారులు	మొత్తం బీపీఎల్ కార్డులు
పాడేరు	0	40165	143026	144193	427075	184358
చింతూరు	0	5906	17662	38283	108427	44189
రంపచోడవరం	0	15143	44328	54402	150719	69545
	0	61214	205016	236878	686221	298092

చట్టాలపై అవగాహనతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నారాయణమూర్తి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జడ్పీ సీఈవో నారాయణమూర్తి అన్నారు. మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇందులో పాల్గొన్న సీఈవో మాట్లాడుతూ.. సర్పంచులు, వార్డు సభ్యులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరుచేస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 62 మంది ఎంపిక

అరకులోయ, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా అరకులోయలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. స్థానిక ఆర్ఐటీఐలో నిర్వహించిన జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, నవతా ట్రాన్స్‌పోర్ట్, భారత్ పే, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ తదితర కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 195 మంది యువత ఇందులో పాల్గొనగా.. 62 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అరకులోయ సీఐ హిమగిరి మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు ఎప్పుడూ వెన్నంటే ఉంటాయన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి సంగీత, ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి రోహిణి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన అభ్యర్థికి ధ్రువపత్రం అందజేస్తున్న సీఐ హిమగిరి, జిల్లా ఉపాధి కల్పనాధికారి సంగీత

అసాంఘిక శక్తులపై అప్రమత్తం



ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ గోపాలకృష్ణ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో విజృంభిస్తున్న అసాంఘిక శక్తుల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకుని, వాటి పట్ల అప్రమత్తంగా మెలగాలని మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ సూచించారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులంతా తమ గ్రామాల్లో ప్రజలకు ఇటువంటి అక్రమ కార్యకలాపాల నిరోధానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గుర్తేడు ఎస్సై సాయికుమార్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రామారావుదొర, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందిస్తాం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఎలుగుబంటి దాడిలో గాయాలపాలైన గిరిజనులకు నష్టపరిహారం అందించేలా ప్రభుత్వానికి నివేదిక అందించనున్నామని పాడేరు డివిజన్ ఇన్‌ఛార్జి డీఎఫ్‌వో ఉమామహేశ్వరి తెలిపారు. గుంటగన్నెల పంచాయతీ పిత్తగుడ గ్రామంలో ఎలుగుబంటి దాడిలో ముగ్గురు గిరిజనులు గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రేంజ్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం గిరిజనులతో సమావేశమయ్యారు. సర్పంచి మోతిలాస్, అటవీశాఖ సెక్షన్ అధికారులు అప్పన్న, వెంకయ్యచౌదరి, బీట్ అధికారులు ఉద్దంగి, రామచంద్రరావు, రేణుక, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



కేజీహెచ్‌లో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

★ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే మత్స్యలింగం శుక్రవారం పరామర్శించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, వైద్య నిపుణులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ట్రైబల్ సెల్ వైద్య నిపుణులు సంపత్, రవీంద్ర పాల్గొన్నారు.



పిత్తగుడ అటవీ ప్రాంతంలోని సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఇకపై కేజీహెచ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు!


★ వచ్చే ఏడాది ఎంబీబీఎస్ సీట్లు పెరిగే అవకాశం
★ పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ హేమలత



పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాడేరు వైద్య కళాశాల గిరిజనులకు వరం లాంటిదని ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత పేర్కొన్నారు. ఈ వైద్య కళాశాలను ఈనెల 14వ తేదీన కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 50 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి అనుమతిచ్చారు. ఈ నేపథ్యంలో కళాశాలకు సంబంధించి భవన నిర్మాణాలు, సీట్ల భర్తీ, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను 'న్యూస్‌టుడే', ఈటీవీకి శుక్రవారం ప్రిన్సిపల్ వివరించారు. ఆమె మాటల్లోనే.. 'కళాశాలలో తొలి ఏడాది 50 ఎంబీబీఎస్ సీట్లకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందులో ఇప్పటికే 42 సీట్లు భర్తీ చేశాం. వైద్యపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న గిరిజనులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఒకప్పుడు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. తొలి ఏడాది ఎనాటమీ, బైకెమిస్ట్రీ, ఫిజియాలజీ కోర్సులకు సంబంధించి ల్యాబ్, తరగతి గదులు సిద్ధం చేశాం. 180 మంది విద్యార్థులకు సరిపడా గ్యాలరీని నిర్మించాం. వచ్చే విద్యా సంవత్సరంలో సీట్ల సంఖ్య వందకు చేరే అవకాశం ఉంది. రూ.500 కోట్లతో నిర్మితమవుతున్న ఈ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడడం లేదు. ఇప్పటివరకూ భవన నిర్మాణాలకు సుమారు రూ.155 కోట్లు ఖర్చయింది. మొదట 256 మినిస్టీరియల్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. ఇప్పటికి పదకొండు పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. ప్రభుత్వం ఈ ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేసింది. అనుమతి వచ్చిన వెంటనే మిగులు పోస్టుల భర్తీకి సన్నాహాలు చేస్తాం. అన్నా, ఆంధ్రా యూనివర్సిటీల్లో సుమారు 25 సంవత్సరాల అనుభవమున్న వైద్య నిపుణులు ఇక్కడ బోధించనున్నారు. జనరల్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, గైనకాలజీ వైద్య నిపుణులు స్థానికంగా అందుబాటులో ఉండనున్నారు. స్థానికురాలినైన నాకు వైద్య కళాశాలలో మొదటి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. స్థానికంగా గిరిజనుల ఆరోగ్య పరిస్థితులు, అవసరాలపై పూర్తిగా అవగాహన ఉంది. ప్రతికూల పరిస్థితుల్లోనూ శరవేగంగా కళాశాల నిర్మాణాలు చేపట్టి ప్రారంభానికి చర్యలు తీసుకున్న సీఎం, ఆరోగ్యశాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామ'ని ప్రిన్సిపల్ వివరించారు.



(c) eenadu



ఈనాడు, విశాఖపట్నం

అతివలూ.. అప్రమత్తమైతేనే!

మహిళల్లో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

తొలిదశలో గుర్తిస్తే నివారణ సాధ్యం

రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల బారిన పడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. జీవనశైలి మార్పులు, సరైన ఆహారం తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు తదితర కారణాలతో ఎక్కువ మంది వీటి బారిన పడుతున్నారు.

వ్యాధిని ముందుగా గుర్తించే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడానికి చాలా మంది మహిళలు వెనకడుగు వేస్తున్నారు. ఎక్కువ మంది తీవ్రత పెరిగిన తర్వాతే ఆసుపత్రులకు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రాథమిక దశలో గుర్తించి, చికిత్స తీసుకుంటే తక్కువ ఖర్చులో నివారణ సాధ్యమేనని పేర్కొంటున్నారు.

స్వీయ పరీక్ష చేసుకుంటే: గతంలో రొమ్ము క్యాన్సర్ రెండో స్థానంలో ఉంటే ప్రస్తుతం మొదటి స్థానానికి చేరింది. వయసు పెరిగేకొద్దీ ఈ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ. 20 ఏళ్లు దాటిన అమ్మాయిలు స్వీయ రొమ్ము పరీక్ష చేసుకోవాలి. 30 ఏళ్లు దాటిన తర్వాత ఏడాదికోసారి వైద్యులను కలిసి రొమ్ము పరీక్షలు, 40 ఏళ్లు దాటితే మామోగ్రామ్ చేయించుకోవాలి. స్వీయ పరీక్షపై అవగాహన పెంచుకుంటే తొలి దశలోనే వ్యాధిని గుర్తించవచ్చు.

మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రిలో గతేడాది గుర్తించిన కేసులు (సుమారు)



హెచ్‌పీవీ టీకాతో రక్షణ: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు తొలి దశలో గుర్తించేందుకు ఏడాదికోసారి పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవాలి. అది చేయించుకుంటే ఏదైనా ఇన్‌ఫెక్షన్లు ఉంటే ముందుగానే తెలుస్తుంది. ప్రస్తుతం మనకు హెచ్‌పీవీ టీకాలు అందుబాటులోకి వచ్చాయి. రూ.2 వేల నుంచి రూ.10 వేల ధరలో టీకాలు అందుబాటులో ఉన్నాయి. 9-15 ఏళ్ల పిల్లలకు ఒక డోసు వేయించినా చాలని వైద్యులు చెబుతున్నారు. ఫలితంగా 20 ఏళ్ల తర్వాత ఆ క్యాన్సర్ కేసులు తగ్గించగలమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

2022లో దేశవ్యాప్తంగా నమోదైన కేసులు..

గర్భాశయ ముఖద్వార	1,27,526
రొమ్ము క్యాన్సర్	1,92,020

- ప్రస్తుతం దేశంలో 14.13 లక్షల క్యాన్సర్ కేసులున్నాయి. ఐసీఎంఆర్-నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్‌ఫర్మేటిక్స్ అండ్ రీసెర్చ్ చేసిన అధ్యయనం ప్రకారం 2045 నాటికి వాటి సంఖ్య 24.56 లక్షలు దాటుతుందని అంచనా.

రోజుకో కేసు: నగరంలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రిలో రోజుకు ఒక రొమ్ము క్యాన్సర్ కేసు వస్తుంది. అందులో తొలి దశలో వస్తున్నవారు చాలా తక్కువ. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు వారానికి కనీసం 10 వస్తుంటాయి. 'ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ సోకిన భాగం వరకే తొలగిస్తారు. తీవ్రత పెరిగితే రొమ్ము మొత్తం తొలగించాల్సిన పరిస్థితి వస్తుంది. కుటుంబంలో ఎవరికైనా రొమ్ము క్యాన్సర్ వస్తే ఆ ఇంట్లో అమ్మాయిలు 20 ఏళ్ల దాటగానే తరచూ పరీక్షలు చేయించుకోవాలి' అని వైద్యులు చెబుతున్నారు.

స్పందన తక్కువే...

కేజీహెచ్‌లో అక్టోబరు, నవంబరు నెలల్లో 40 ఏళ్లు దాటిన కనీసం 15 మంది మహిళలకు ప్రతి రోజూ ఉచితంగా మామోగ్రామ్ పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు వస్తే ప్రస్తుతం ఆరు నుంచి ఏడుగురు వస్తున్నారు. గతంలో కంటే సంఖ్య పెరిగినా అనుకున్న స్థాయిలో స్పందన లేదని వైద్యులు చెబుతున్నారు. 'మామోగ్రామ్ పరీక్షలకు మహిళలు వెనకడుగు వేస్తున్నారు. కేజీహెచ్‌లో నిత్యం ఉచితంగా పరీక్షలు చేస్తాం. స్క్రీనింగ్ చేయించుకుంటే తొలిదశలో గుర్తించవచ్చు' అని మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప తెలిపారు.

నేడు, రేపు డైవర్స్/విడో/విడోవర్ (అన్ని కులాలు)లకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి డైవర్స్/విడో/విడోవర్‌లకు ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలో ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు

నేడు (శనివారం, అక్టోబరు 19న), రేపు (ఆదివారం, అక్టోబరు 20న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 91549 18858, 80080 01686 ఫోన్‌నెంబర్ల ద్వారాగానీ, యాప్‌ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపించవచ్చు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం

ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా జాతీయ రహదారి పనులు చురుగ్గా జరుగుతున్నందున, ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ వద్ద జరిగిన రహదారి భద్రతా సమావేశంలో జేసీ మాట్లాడారు. పర్యాటక సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఘాట్ రోడ్లలో రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారులు అన్ని భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్టీఓ లీలాప్రసాద్, మోటార్ వాహనాల అధికారి రాజేష్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి, డీఎంహెచ్‌ఓ జమాల్‌బాషా, డీఎస్పీ ఎస్.కృష్ణారావు, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, సీఐలు, ఎస్సైలు, 104, 108 వాహనాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ, చిత్రంలో ఆర్టీఓ లీలాప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి

పాడేరు, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మండల విద్యాశాఖాధికారులు, కళాశాల ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు నవంబరు 6వ తేదీలోగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, డీఈఓ బ్రహ్మాజీరావు ఎంఈఓలు పాల్గొన్నారు.

28 నుంచి బాలల ప్రతిభాపాటవ పోటీలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి జిల్లా స్థాయి బాలల ప్రతిభాపాటవ పోటీలు జరగనున్నాయి. వీటికి సంబంధించిన ప్రచార ప్రతులను శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నంలో శుక్రవారం ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజే నాథ్ మాట్లాడుతూ.. 28న చిత్రలేఖనం, 29న సబ్ జూనియర్స్, 30న సీనియర్స్ విభాగాల్లో దేశభక్తి గీతాల పోటీ, నవంబరు 2న సబ్ జూనియర్స్, 4న జూనియర్స్, 6న సీనియర్స్‌కు పద్యపఠనం, 6న జూనియర్స్, 7న సీనియర్స్‌కు వక్తృత్వం, 8న ఉదయం జూనియర్స్, మధ్యాహ్నం సీనియర్స్‌కు వ్యాసరచన, 9న క్విజ్, 11న మట్టితో కళాకృతుల తయారీ, 12న కాగితపు బొమ్మల తయారీ, 13న వేషధారణ, జానపద నృత్యాల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



ప్రచార ప్రతులను ఆవిష్కరిస్తున్న అయ్యన్న, ఉపాధ్యాయులు

గబ్బాడలో ఇసుక విక్రయానికి సన్నాహాలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: గబ్బాడ యార్డులో నిల్వ ఉన్న 48 వేల టన్నుల పైగా ఇసుకను విక్రయించేందుకు యంత్రాంగం దృష్టిసారించింది. రెండు, మూడు రోజుల్లో జిల్లా అధికారులు దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ వి.వి.రమణ, గనుల శాఖ ఏడీలు ఎం.శ్రీనివాసరావు (అనకాపల్లి), శివాజీ (నర్సీపట్నం), తహసీల్దార్ రామారావు శుక్రవారం యార్డును సందర్శించారు. కాటా, సీసీ కెమెరాలు పనిచేస్తున్నదీ, లేనిదీ పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సమావేశమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించారు. గతంలో ఇసుక అమ్మకాలను పర్యవేక్షించిన నలుగురు సచివాలయ సిబ్బందిని గనుల శాఖ కార్యాలయానికి పిలిపించి నిర్వహణ ఎలా ఉండేదో తెలుసుకున్నారు. విక్రయాలకు వీలుగా ఈ-పోస్ మిషన్, సెల్‌ఫోన్లు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం గబ్బాడ ఇసుక నిల్వ కేంద్రం వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. పునరుద్ధరించాలని ఉన్నతాధికారులతో మాట్లాడామని అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రమంతా జులై 8న ఉచితంగా ఇసుక సరఫరా చేసే చేపట్టినా గబ్బాడలో మొదలు కాలేదు. రాజమహేంద్రవరంలో అక్రమంగా తవ్వి ఇక్కడ నిల్వ చేశారని, విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకున్న తర్వాత అమ్మకాలు చేపట్టాలని శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశించడంతో ఇక్కడ అమ్మకాలు మొదలు కాలేదు. పర్యావరణ అనుమతులు లేకుండానే రాజమహేంద్రవరంలో ఇసుక తవ్వి ఇక్కడ నిల్వ చేశారని గనులశాఖ అధికారులు గుర్తించి ప్రతిమ సంస్థ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చారు. పర్యావరణ అనుమతులకు సంబంధించిన పత్రాలన్నీ సమర్పించామని, తమ తప్పిదం ఏదీ లేదని సంస్థ ప్రతినిధులు తెలియజేసినా సంతృప్తి చెందని అధికారులు రూ.18.7 కోట్లు జరిమానా చెల్లించాలని ఇటీవల నోటీసు జారీ చేశారు. దీనిపై గుత్తేదారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇసుక విక్రయాలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారని అయ్యన్నపాత్రుడు గనుల శాఖ ఏడీ శివాజీ సూచించారు. అంతకు ముందు కలెక్టర్‌తోనూ మాట్లాడారు.



ఆర్డీవో రమణతో సమావేశమైన గనుల శాఖ అధికారులు

ఉపాధ్యాయుల్లేక చదువుకు దూరం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం కారణంగా గిరిజన బాలలు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి మండలంలోని రెండు పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించకపోవడంతో ఒక్క రోజు కూడా బోధన జరగలేదు. దీనిపై బాలల తల్లిదండ్రులు శుక్రవారం ఆయా పాఠశాలల ఎదుట నిరసన తెలిపారు. మండలంలోని మారుమూల వాడమామిడి, పెద్ద అగ్రహారం గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక(టీబ్ల్యూ) పాఠశాలలున్నాయి. ఒక్కో పాఠశాలలో 30 మందికిపైగా బాలబాలికలు ఉన్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఆయా పాఠశాలలకు ఉపాధ్యాయులు రాలేదు. గతేడాది పనిచేసిన సీఆర్టీలు బదిలీపై వెళ్లిపోవడం, ఆ స్థానంలో వేరేవాళ్లను నియమించకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. పలుమార్లు విద్యాశాఖ అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని గిరిజనులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోధన సాగేలా చూడాలన్నారు. దీనిపై మండల విద్యాశాఖ అధికారి రామన్నను సంప్రదించగా.. వాడమామిడి, అగ్రహారం పాఠశాలలు సముదాయం ప్రధానోపాధ్యాయుల పరిధిలో ఉన్నాయన్నారు. ఐటీడీఏ అధికారులకు తప్ప తమకు ఉపాధ్యాయులను నియమించే అధికారం లేదన్నారు.



పెద్దఅగ్రహారంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై నక్కపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మనబాలవానిపాలేనికి చెందిన కొర్రా శ్రీను నక్కపల్లిలో రోడ్డు దాటుతుండగా, అల్లూరి జిల్లా అరకులోయకు చెందిన శెట్టి వినోద్ తన స్నేహితుడితో కలిసి బైక్‌పై తుని వైపు వెళుతూ శ్రీను వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శ్రీను తలకు బలమైన గాయమైంది. వినోద్ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సందర్శక ప్రాంతాలను శుభ్రంగా ఉంచండి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయలో పర్యటక శాఖకు చెందిన ఆస్తుల నుంచి పంచాయతీలకు రావాల్సిన బకాయిలపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని జడ్పీ సీఈఓ నారాయణమూర్తి.. ఎంపీడీఓ లవరాజు, పంచాయతీ ఈఓలకు సూచించారు. శుక్రవారం అరకులోయ వచ్చిన ఆయన మండల పరిషత్తు కార్యాలయం, జడ్పీ అతిథిగృహాన్ని సందర్శించారు. పర్యటక ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. పెదలబుడు గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ అభివృద్ధి చేయాలన్నారు. ఎంపీడీఓ లవరాజు, ఏఓ ఉదయభాస్కర్, పెదలబుడు ఈఓ రాజ్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలస్యంగా ఉద్యోగుల 'స్పందన'

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు శుక్రవారం నిర్వహించిన స్పందన ఆలస్యంగా ప్రారంభమైంది. సాయంత్రం నాలుగు గంటలకు ఈ కార్యక్రమం మొదలవ్వాల్సి ఉండగా.. సాయంత్రం 7.50 గంటలకు ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ మండలాల నుంచి భారీ ఎత్తున ఉద్యోగులు తరలివచ్చారు. దూరప్రాంతల నుంచి వచ్చిన ఉద్యోగులు మూడు గంటలపాటు పడిగాపులు కాయాల్సి వచ్చింది. డీఆర్ఓ బి.పద్మావతి వినతులు స్వీకరించారు. చింతపల్లి ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకురాలిగా నియమితులైన డాక్టర్ జి.ప్రభావతి తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఆసుపత్రి ఉద్యోగులు టి.రాజారావు, బి.వి.వి.లక్ష్మి వినతిపత్రం సమర్పించారు.



ఉద్యోగుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న డీఆర్ఓ పద్మావతి

కార్యాలయాల పరిశీలన

రాజవొమ్మంగి: మండల ప్రత్యేక అధికారి జాన్‌రాజ్ మండలంలోని పలు కార్యాలయాలను శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ సచివాలయం, ఆరోగ్య ఉప కేంద్రం, ప్రాథమిక పాఠశాలలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు ఉన్నారు.

యువతకు వాలీబాల్ కిట్ల పంపిణీ

అడ్డతీగల, న్యూస్‌టుడే: యువత ఆటలపై దృష్టి సారించాలని సీఐ నరసింహమూర్తి అన్నారు. శుక్రవారం డి.రామవరంలో యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఎస్సై వెంకయ్య, సిబ్బంది పాల్గొన్నారు. బొడ్లంక గ్రామంలో ఎస్సై వినోద్ ఆధ్వర్యంలో సారా నిర్మూలన పై అవగాహన సదస్సు నిర్వహించారు. జనసేన వీరమహిళ గోపి సీతామహాలక్ష్మి, తెదేపా నాయకులు గొర్లె నిశాంత్, శ్రీను బాబు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌ది కీలకపాత్ర

పాడేరు, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో కెరీర్ గైడెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ పేర్కొన్నారు. విద్యార్థులు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. శుక్రవారం గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సూపర్ 50 పేరిట పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పది తర్వాత ఉన్న కోర్సులను వివరించారు. సాంకేతిక కోర్సులతో ఉపాధి అవకాశాలు త్వరగా లభిస్తాయన్నారు. విద్యార్థులు ఆసక్తి ఉన్న గ్రూపుల్లో చేరి ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లను ఆదేశించారు. గిరిజన సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి డీడీ ఎల్ రజని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఐటీడీఏ పీఓ అభిషేక్, చిత్రంలో డీడీ రజని తదితరులు

పాపికొండల పర్యటక బోట్లకు తనిఖీలు

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ ఆలయం నుంచి పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యటక బోట్లను రెవెన్యూ, పోలీసు అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై షరీఫ్‌తోపాటు పర్యటక శాఖ అధికారులు బోట్ల దస్త్రాలన్నీ తనిఖీ చేశారు. ఒక్కో బోటులో ఎంత మంది వెళ్తారు? వారి కోసం తీసుకుంటున్న భద్రతా చర్యలు అడిగి తెలుసుకున్నారు. లైఫ్ జాకెట్లు పరిశీలించారు. లైసెన్సులు ఎప్పటి వరకూ అనుమతులు ఉన్నాయి, సరంగులు (డ్రైవర్లు) లైసెన్సులు, బోటుకు బీమా, రూట్ మ్యాప్‌లు పరిశీలించారు. గోదావరి వరదల నేపథ్యంలో జులై 13 నుంచి పాపికొండల విహారయాత్ర నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం గోదావరిలో వరద తగ్గుతున్న నేపథ్యంలో ఈ తనిఖీలు అనంతరం త్వరలోనే ఈ విహారయాత్రకు అధికారులు పచ్చజెండా ఊపనున్నారు. పర్యటక శాఖ జీఎం నాగేశ్వరరావు, పవన్, గంగబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బోట్ల దస్త్రాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

అటవీ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని వినతి

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి మండలంలోని లంబసింగి, తాజంగి, చెరువులవెనం ప్రాంతాల్లో అటవీ, పర్యావరణ పర్యాటకం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోరాబు అనూషాదేవి కోరారు. శుక్రవారం డీఎఫ్ఓ నరసింహరావును ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, సర్పంచి పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ప్రాంతానికి పర్యాటకంగా విశేష గుర్తింపు ఉండటంతో దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యటకులు వస్తున్నారన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు.



జొన్నమామిడి వద్ద డంపింగ్ యార్డు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో, ఎస్ఈ తదితరులు

సీలేరులో డీఎఫ్‌వో పర్యటన

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో నూతనంగా నిర్మించ తలపెట్టిన పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన అటవీ ప్రాంతాన్ని చింతపల్లి నూతన డీఎఫ్‌వో వై.వెంకట నరసింహరావు శుక్రవారం పరిశీలించారు. ప్రాజెక్టు గురించి ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆయనకు వివరించారు. అనంతరం జొన్నమామిడిలో నిర్మించనున్న డంపింగ్ యార్డు ప్రాంతాన్ని డీఎఫ్‌వో పరిశీలించారు. ఎంత స్థలం అవసరమో ఎస్ఈని అడిగి తెలుసుకున్నారు. పార్వతీనగర్‌లో జలవిద్యుత్కేంద్రం నిర్మించే ప్రదేశాన్ని చూశారు. ఉప రేంజి అధికారి సింహాచలం పడాల్, రేంజి అధికారి సుంకరి వెంకటరావు, డీఈఈ టి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: వనుగుమ్మ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.సత్యం (55) శుక్రవారం ఉదయం ముంచంగిపుట్టులో మృతి చెందారు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని ఖండివరం గ్రామానికి చెందిన సత్యం గురువారం సాయంత్రం వనుగుమ్మ వెళ్లేందుకు ముంచంగిపుట్టులో వాహనాల కోసం ప్రయత్నించారు. వాహనాలు లేక ముంచంగిపుట్టులోని దుకాణ సముదాయల వద్ద రాత్రంతా ఉండిపోయారు. అనారోగ్యంతో ఉన్న సత్యం శుక్రవారం ఉదయం చనిపోయారని మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. దూరప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చి విద్యను బోధించిన ఉపాధ్యాయుడు సత్యం మృతదేహానికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీఆర్పీలు నివాళులు అర్పించారు. స్థానిక సీహెచ్‌సీలో ఉంచిన మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

రోడ్డు సౌకర్యం కల్పించరూ..

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సురవరం గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. పాడేరులో ఐటీడీఏ పీవో అభిషేక్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లకవరపుపేట పంచాయతీ పరిధిలోని తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్య పరిష్కారం కావడం లేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని కోరారు. లకవరపుపేట ఉప సర్పంచి గంగాధర్, పెద్దబ్బాయి, చిన్నలదొర, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: లోతట్టు గిరిజన గ్రామాల ప్రజలు తమ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బోదులూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని చావడికోట పంచాయతీ పరిధిలోని ఆకుమామిడికోటలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వారపు సంత కావడంతో పరిసర గ్రామాల నుంచి అధికసంఖ్యలో రోగులు వైద్య శిబిరానికి తరలివచ్చి సేవలు పొందారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలను నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. హెచ్‌వీ రమాదేవి, వైద్య సిబ్బంది, జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు గొర్లె చిననారాయణరావు పాల్గొన్నారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని బోలగొండలో ఎన్టీఆర్ ట్రస్టు, జీఎస్సార్ ఫౌండేషన్ సంయుక్తంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని కందుల సాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు ఏజెన్సీ ప్రాంతంలో ఈ నెల 11 నుంచి 31 వరకు పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ 75 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామపెద్దలు ప్రకాష్, భాస్కర్, అబ్బాయి దొర, రామకృష్ణ దొర పాల్గొన్నారు.



ఆకుమామిడికోటలో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మత్స్యగెడ్డలో కొనసాగుతున్న గాలింపు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: దారెల పంచాయతీ పెదపేట గ్రామ సమీపంలో మత్స్యగెడ్డలో నాటుపడవ మునిగి గల్లంతైన కొర్రా వేణుగోపాలస్వామి ఆచూకీని గుర్తించేందుకు ఎస్డీఆర్ఎఫ్ బృందం శుక్రవారం గాలింపు చేపట్టింది. మత్స్యగెడ్డ ఉద్ధృతంగా ఉండటంతో స్థానికుల సహకారంతో పెదపేట నుంచి రోగులపేట మార్గంలో మత్స్యగెడ్డలో గాలించారు. మత్స్యగెడ్డలో 60 మీటర్ల వరకు లోతు ఉంటుందని, లోతైన ప్రదేశంలో పడవ మునగటంతో ఆచూకీ తెలియటం లేదని స్థానికులు చెబుతున్నారు. సీఐ వెంకట్రావు, ఎస్సైలు రవీంద్ర, రమణ పర్యవేక్షించారు. పెదబయలు మండలంలోని సీతగుంట సర్పంచి మాధవరావు, స్థానిక నాయకులు కుటుంబసభ్యులు, గెడ్డ ఒడ్డున ఎదురుచూస్తున్నారు.



గాలింపును పర్యవేక్షిస్తున్న ఎస్సై రవీంద్ర, స్థానికులు

BUSINESS SERVICES
WANTED DEALERS/AGENTS
AP ప్రభుత్వంచే ఆమోదం పొందిన ఇసుక లారీ / ట్రాక్టర్లకు GPS అమ్మేందుకు డీలర్లు కావలెను.
కంపెనీ వారి సంప్రదింపు నంబర్లు:
Volty IoT Solutions
8367307070
9666841234

రైవాడ... చూస్తే గుండెదడ!

దేవరాపల్లి, న్యూస్‌టుడే



ప్రశాంత వాతావరణంలో.. ప్రకృతి ఒడిలో చూడచక్కనైన ప్రాంతం రైవాడ జలాశయం. అందాలను ఆస్వాదించేందుకు వచ్చినవారంతా ఇక్కడ నిర్వహణ కొరవడిన పరిస్థితి చూసి భయాందోళనకు గురవుతున్నారు.

రైవాడ వెళ్లడానికి గతంలో పర్యాటకులు ఉవ్విళ్లూరేవారు. కానీ ఇప్పుడు జలాశయం గట్టుతోపాటు జలాశయం లోపల, బయట పెద్ద, పెద్దచెట్లు, తుప్పలు, డొంకలు పెరిగిపోవడంతో అదొక అరణ్యంలా కనిపిస్తోంది. అక్కడకు వెళ్లాలంటే ఏ పొదలో ఏ విషసర్పం ఉందో అని భయపడేంతగా ఈ ప్రాంతం తయారైంది. సుమారు 6 కిలోమీటర్ల పొడవైన మట్టిగట్టుపై గతంలో వాహనాల్లో హాయిగా ప్రయాణించేవారు. ప్రస్తుతం అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు పడటంతో నడవడానికి సైతం వీలులేని స్థితి. జలాశయ లోపలి భాగంలోని గట్టు అంతా చెట్లు ఎదిగి వనాన్ని తలపిస్తోంది. వీటి వేళ్లు మట్టి గట్టులోకి చొచ్చుకుపోవడంతో గట్టు రోజురోజుకు బలహీన పడుతోంది. దీనిని ఇలాగే వదిలేస్తే వరదల సమయంలో ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న భయం అందరినీ వెంటాడుతోంది. జిల్లాలో ఓ వైపు 15,344 ఎకరాలకు సాగునీరు అందిస్తూ మరోవైపు విశాఖ మహానగర ప్రజల దాహార్తి తీర్చే కల్పతరువులాంటి రైవాడ జలాశయానికి ఏ ముప్పు కలగకుండా తక్షణం రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.



గట్టుకు ఇరుపక్కల గుబురుగా తుప్పలు

గట్టు లోపల భాగంలో చెట్లు

ప్రతిపాదనలకు ఆమోదం

రైవాడ జలాశయ నిర్వహణకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. రైవాడ నుంచి కె.కోటపాడు దేవరాపల్లి మండలాల్లోని చెరువులకు నీరందించే కాలువల మరమ్మతుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జలాశయ నిర్వహణతోపాటు కాలువల పనులకు రూ.3.06 కోట్లు విడుదల చేయనుంది. నిధులు విడుదల కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

– సత్యంనాయుడు, రైవాడ జలాశయ డీఈఈ

గొర్రె గేదె దాడిలో గిరి మహిళకు తీవ్రగాయాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలంలో గొర్రె గేదె దాడి చేయడంతో గిరిజన మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుజ్జుమామిడివలస గ్రామానికి చెందిన మట్ల చంద్రకాంత (35) శుక్రవారం తమ పొలంలో నిమ్మకాయలు కోయడానికి వెళ్లింది. ఈ క్రమంలో గొర్రెగేదె ఒక్కసారిగా ఆమెపై దాడి చేయడంతో కాలు విరిగిపోవడంతోపాటు, ముఖంపైనా తీవ్ర గాయాలయ్యాయి. అయితే సకాలంలో వారు పెంచుకుంటున్న కుక్కలు వచ్చి గొర్రెగేదెపై దాడి చేయడంతో ఆమెను విడిచి పరారైంది. సమాచారం తెలిసిన వెంటనే బంధువులు, కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన మారేడుమిల్లి పీహెచ్‌సీకి తరలించగా, అక్కడ వైద్యురాలు రాణీశిరీష ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం రిఫర్ చేయగా అంబులెన్సులో తరలించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్‌డ్	206	240
స్కిన్‌లెస్	234	250

(c) eenadu

రైతు సేవా కేంద్రంగా బోర్డు మార్పు



మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలోని రైతుసేవా కేంద్రం బోర్డు విషయంలో అధికారులు స్పందించారు. ఈ భవనంపై ఉన్న బోర్డును మార్చారు. గత వైకాపా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి పేరును 'రైతుసేవా కేంద్రాలు'గా మార్పు చేసింది. ఇది జరిగి నెలలు కావొస్తున్నా, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఆయా భవనాలపై పేర్లు మార్చలేదు. దీనిపై ఈనెల 16న 'ఈనాడు'లో 'ప్రభుత్వం మారినా... అదే పేరు!' అనే శీర్షికతో కథనం. దీనిపై సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు స్పందించారు. భవనంపై ఉన్న 'రైతు భరోసా కేంద్రం' అనే బోర్డును 'రైతు సేవా కేంద్రం'గా మార్చి రాయించారు.

త్వరలో భవన నిర్మాణం పూర్తిచేస్తాం

స్పందనకు వందనం

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలం గోగుమిల్లి జీపీఎస్ పాఠశాల భవన నిర్మాణాన్ని తొందరలో పూర్తి చేస్తామని మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. శుక్రవారం 'ఈనాడు'లో 'పాకలోనే పాఠాలు.. ఎన్నాళ్లీ పాట్లు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఈవో బ్రహ్మాజీరావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు రంపచోడవరం ఎంఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్ (సీఆర్ఎంటీ) వెంకన్న దొర శుక్రవారం గోగుమిల్లి పాఠశాలను సందర్శించారు. భవనం నిర్మాణం నిలిచిపోవడానికి గల కారణాలపై నివేదిక తయారు చేసి ఎంఈవోకు సమర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామకృష్ణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 2022లో నాడు-నేడు ఫేజ్-2లో పాఠశాల భవన నిర్మాణానికి రూ.37.97 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ మొత్తంలో 14.81 లక్షలు విడుదలయ్యాయన్నారు. దీనిలో ఇప్పటివరకు 13.82 లక్షలు ఖర్చుచేశామన్నారు. ఇంకా మిగిలిన రూ.88,644లు పాఠశాల కమిటీ బ్యాంకు ఖాతాలో ఉన్నాయన్నారు. ఇసుక కొరత, ఇంకా రావాల్సిన నిధులు, మెటీరియల్ రాకపోవడంతో నిర్మాణం పూర్తికాలేదన్నారు. త్వరలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఎంఈవో రామకృష్ణ వివరించారు.

ఆధార్ శిబిరాలు 22 నుంచి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు బస్కి, గన్నెల, పద్మాపురం-2, పెదలబుడు-3 సచివాలయాల వద్ద ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లవరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీడీవోగా శశిభూషణరావు



వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వీఆర్‌పురం ఎంపీడీవోగా శశిభూషణరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న ఫణీంద్ర బదిలీపై వెళ్లిపోయారు. జనసేన మండల శాఖ అధ్యక్షులు ములకాల సాయికృష్ణ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఎంపీడీఓను కలిసి మండల సమస్యలు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు.

నేడు మారేడుమిల్లిలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్'ను శనివారం మారేడుమిల్లిలో నిర్వహించనున్నారు. మండల పరిషత్ కార్యాలయం పాత భవనం ఆవరణలో 'ప్రజాదర్బార్' నిర్వహించడానికి వేదికను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు హంగులు!



అంగన్‌వాడీ కేంద్రంలో కుర్చీలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఇటీవల కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను 'సక్షం' (స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్) కేంద్రాలుగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా చింతపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 19 కేంద్రాలను సక్షం కింద మార్చారు. ఇవి చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి.

ఎంపికైన కేంద్రాలివే..

చింతపల్లి 2, సాయినగర్, చింతలూరు, రామాలయంవీధి, అంతర్ల, లోతుగెడ్డ కూడలి, మామిడిపల్లి, వాముగెడ్డ, కృష్ణాపురం, నిమ్మపాడు, చెరకుంపాకలు, గొందిపాకలు, వంతమామిడి, బెన్నవరం, చిట్రాళ్లగొప్పు, కొత్తపాలెం, ఉమ్మరాసిగొంది, బౌడ, కిటుముల కేంద్రాలను ఈ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.

కల్పించిన సదుపాయాలు

సక్షం పథకానికి ఎంపికైన కేంద్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సదుపాయాలు కల్పించాయి. కుర్చీలు, అర్ధ చంద్రాకారంలో ఉండే బల్లలు, పంకాలు, టీవీ తదితర వసతులు ఏర్పాటు చేశారు. సురక్షితమైన తాగునీటిని అందించేందుకు పరికరాలు సమకూర్చారు. బాలలను ఆకట్టుకునేలా బోధించడానికి ఎల్ఈడీ స్మార్ట్ టీవీలను పలు కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. పిల్లల శారీరక, మానసిక, భావన్మాతక అభివృద్ధికి దోహదం చేసేలా కేంద్రాలను ఆకర్షణీయంగా వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువులతో అలంకరించారు. పోషణ వాటిక పేరుతో కేంద్రాల ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుతున్నారు. ఇక్కడ పండిన వాటిని తల్లీబిడ్డలు, గర్భిణులు, కిశోర బాలికలకు పోషకాహారంగా అందజేస్తారు. ఆవరణలో వాననీటి సంరక్షణ కోసం గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో గుంతలు తవ్వించారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పెంచుతున్న మొక్కలు

లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహణ



సక్షం పథకంలో ఎంపికైన కేంద్రాల్లో ప్రతిపాదిత మార్పులు చేశారు. కొన్ని కేంద్రాలకు మాత్రమే ఎల్ఈడీ టీవీలు వచ్చాయి. మిగిలిన సదుపాయాలు అన్నిటికీ మంజూరు చేశారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఈ కేంద్రాలను నిర్వహించాలి.

– రమణి, ఐసీడీఎస్ సీడీపీవో, చింతపల్లి

అ వీ ఇ వీ

అవకాశాలు అందిపుచ్చుకోండి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువత వ్యసనాలను వదిలి, ఉపాధి వైపు అడుగులు వేయాలని స్టూడెంట్స్ కొఫొకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు అన్నారు. బొయితిలి, కిల్లంకోట, నుర్మతి, భీరం పంచాయతీల్లో నిరుద్యోగ యువతతో శుక్రవారం సమావేశమయ్యారు. నిరుద్యోగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

రహదారులు నిర్మించాలని వినతి

అనంతగిరి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాలకు రహదారుల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వాటిని పూర్తి చేయాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పాగి అప్పారావు కోరారు. ఐటీడీఏ పీఓ అభిషేక్‌కు వినతిపత్రం అందించారు..

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: చిన్నజడుమూరులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని స్థానిక గిరిజనులు ఐటీడీఏ పీవోను కోరారు. గ్రామంలో అంగన్‌వాడీ, సామాజిక, పాఠశాల భవనాలు నిర్మించాలన్నారు. ఊలం ఈశ్వరరావు, దేశగిరి గోవింద్, ఊలం బాబూరావు, దేశగిరి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



పాడేరులో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో లవరాజు, డీఎల్‌పీఓ

పాడేరు, హుకుంపేట, న్యూస్‌టుడే: వ్యాపార దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలని, లేనిపక్షంలో యజమానులకు జరిమానా విధిస్తామని జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు అన్నారు. పరిసరాల శుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పాడేరులో శ్రమదానం చేపట్టారు. డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, సర్పంచి ఉషారాణి పాల్గొన్నారు. హుకుంపేటలో అధికారులు, నాయకులు, వ్యాపారులు కలసి స్వచ్ఛతే సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ రాజుబాబు, వైస్ ఎంపీపీ కొండలరావు పాల్గొన్నారు.

చింతూరు, గంగవరం, న్యూస్‌టుడే: చింతూరు ఐటీడీఏ పరిధిలోని అన్ని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ పేర్కొన్నారు. డ్రైడే- డ్రైడే సందర్భంగా శుక్రవారం చింతూరు సంతపాకల మైదానం నుంచి కూడలి వరకు చెత్త తొలగించే కార్యక్రమంలో పీఓ పాల్గొన్నారు. సర్పంచి కారం కన్నారావు, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో మోహన్ పాల్గొన్నారు. మొల్లేరు పంచాయతీలో సర్పంచి కుంజం లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి డీవీఎల్ఎన్ రాఘవన్ పరిశీలించారు. ఎంపీడీవో రామకృష్ణ, మండల తెదేపా అధ్యక్షుడు పాము అర్జున్ పాల్గొన్నారు.

కూనవరం, మారేడుమిల్లి, న్యూస్‌టుడే: కూనవరంలో తెదేపా నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎడవల్లి భాస్కర్‌రావు, కూటమి నాయకులు చెత్త తొలగించారు. సర్పంచి హేమంత్, ఎంపీటీసీ సభ్యుడు సాంబశివరావు పాల్గొన్నారు. మారేడుమిల్లిలో ఈవోపీఆర్డీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 'వనవాసీ' స్వచ్ఛంద సంస్థతో కలిసి చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధులు శుభ్రం చేశారు. సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మోతుగూడెం, వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: చదలవాడ పంచాయతీ తులసిపాక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఉదయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. రేఖపల్లిలోని కార్యాలయాలు, వీఆర్‌పురంలో అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో సిబ్బంది చెత్త తొలగించారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లిలో ఎంపీపీ అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో అశాజ్యోతి, సర్పంచి పుష్పలత తదితరులు సంత మార్కెట్ వద్ద పరిశుభ్రత పనులు చేపట్టారు. సీడీపీవో రమణి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాయం వద్ద, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాజంగిలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు జలాశయం వద్ద సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌ఛార్జి సహాయ కమాండెంట్ వీసీహెచ్ పాండే పాల్గొన్నారు.



చెత్త తొలగిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో భరత్, అధికారులు

బస్‌షెల్టరులో భయంభయం



మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో గాలిగోపురం వద్ద అధికారులు బస్‌షెల్టర్ నిర్మించారు. మండలంలోని తాడేపల్లి పంచాయతీ మల్లవరం తదితర గ్రామాల గిరిజనులు అటవీ మార్గం మీదుగా కాలినడకన వచ్చి గాలిగోపురం వద్ద చేరుకుని, అక్కడి నుంచి వాహనాలపై మారేడుమిల్లి వస్తుంటారు. వీరంతా కూడా వాహనాల కోసం ఈ బస్‌షెల్టరు వద్దే వేచి ఉంటారు. మారేడుమిల్లి పర్యటక ప్రాంతం కావడంతో నిత్యం వందలాది మంది ప్రత్యేక వాహనాల్లో ఇక్కడికి తరలి వస్తుంటారు. ఈ విధంగా వచ్చే వారిలో అధిక శాతం మంది మందుబాబులే. మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారిలో అటవీ ప్రాంతంలో ఉన్న ఈ బస్‌షెల్టరు ఇటువంటి మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. బొంగుచికెన్, బొంగు బిర్యానీ వంటివి అక్కడికి తీసుకుని వెళ్లి ఈ బస్‌షెల్టరులోనే మద్యం తాగడంతో వారి ఆగడాలకు అంతు లేకుండా పోయింది. బస్‌షెల్టరు ధ్వంసం చేయడం, అక్కడే మద్యం సీసాలు పగులు కొట్టడం వంటి చేయడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో ప్రస్తుతం బస్‌షెల్టరు శిథిలస్థితికి చేరింది. మందుబాబుల ఆగడాలతో ఇక్కడకు వేడి ఉండే గిరిజనులు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు.

గడువు పొడిగింపు

పాడేరు, న్యూస్‌టుడే: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశాలు పొందేందుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 29 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 31వ తేదీవరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆశ్రమాల్లో జ్వరాల నియంత్రణకు చర్యలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు జ్వరాలు సోకకుండా చర్యలు తీసుకున్నామని మలేరియా చింతపల్లి సబ్ యూనిట్ అధికారి కన్నబాబు అన్నారు. రింతాడ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల వసతిగృహంలో, పరిసరాల్లో శుక్రవారం మలేరియా మందు పిచికారీ చేయించారు. ఆరోగ్య సహాయకుడు సత్యనారాయణ, హెచ్‌ఎం పాపియమ్మ పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు లాభయుక్తంగా ధరలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: మాక్స్ సొసైటీ, జీసీసీ ఆధ్వర్యంలో ప్రకటించిన కాఫీ మద్దతు ధరలు కార్పొరేట్ సంస్థలకు లాభయుక్తంగా ఉన్నాయని గిరిజన కాఫీ రైతు సంఘం జాతీయ నాయకులు గెమ్మెలి చిన్నబాబు అన్నారు. సుంకరమెట్ట పంచాయతీ బెడ్డగుడ గ్రామంలో పర్యటించిన ఆయన కాఫీ రైతులతో మాట్లాడారు. రైతుల అభిప్రాయాలతో ధరలు ప్రకటించాలన్నారు.

పరిహారం ఇవ్వకపోవడం దారుణం

కూనవరం, న్యూస్‌టుడే: గోదావరి వరద బాధితులందరికీ పరిహారాలు ఇవ్వాలని వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య కోరారు. భీమవరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు పరిహారాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం కొందరు బాధితులకు పరిహారాలు ఇవ్వకపోడం దారుణమన్నారు. బాధితులు కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు తప్పా.. వారికి న్యాయం చేసేవారు లేకుండా పోయారన్నారు. పాయం సీతారామయ్య, జయసుధ, శ్రీనివాసరావు, నాగరాజు, ఈశ్వర్లు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించండి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ గిరిజన మ్యూజియం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని ఐటీడీఏ పీఓ అభిషేక్ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్‌లో బినామీలు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి



చింతపల్లి బాలసదనం పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న న్యాయమూర్తి ధర్మారావు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆశ్రమ, బాలసదనం పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అనకాపల్లి జిల్లా న్యాయమూర్తి జి.ధర్మారావు అన్నారు. శుక్రవారం చింతపల్లి బాలసదనం పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మరుగుదొడ్లు, తాగునీరు, భవనాలు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాచ్‌మెన్‌ను నియమించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎక్కడకు వెళ్లి చదువుతున్నారని సూపరింటెండెంట్ వరలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. బాలలంతా కిలోమీటరు దూరంలోని జిల్లా పరిషత్తు పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారని ఆమె తెలిపారు. ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, సీడీపీవో రమణి, ఎంఈవో బోడంనాయుడు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు: పీవో

చింతూరు, న్యూస్‌టుడే: క్రమశిక్షణ అలవర్చుకుని, ప్రణాళిక ప్రకారం చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ పేర్కొన్నారు. చింతూరు డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. పీవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవితంలో అభివృద్ధి సాధించాలంటే అనేక మార్గాలున్నాయని, వాటిని అందిపుచ్చుకుని జీవిత లక్ష్యాలు సాధించుకోవాలని విద్యార్థులకు సూచించారు. డిగ్రీ చదువులకు వచ్చేశాం.. అనే అశ్రద్ధ ఉండకూడదన్నారు. తల్లిదండ్రులను మంచి పేరు తెచ్చేలా కష్టపడాలని వివరించారు. ఈ సందర్భంగా పీవోను సన్మానించారు. అనంతర విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రత్నమాణిక్యం, అధ్యాపకులు ముల్లి శేఖర్, వెంకట్రావు, హారతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పీవోను సన్మానిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ముఖ ఆధారిత హాజరుతో రేషన్

కొయ్యూరు, న్యూస్‌టుడే: పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదైన బాలింతలు, గర్భిణులకు ముఖ ఆధారిత హాజరు ద్వారా టేక్ హోం రేషన్ పంపిణీ చేయాలని సీడీపీవో విజయకుమారి అన్నారు. చుట్టుబంద, బొంకులపాలెం, రాజేంద్రపాలెం, చింతలపూడి, కొయ్యూరు, గాదిగుమ్మి, రామరాజుపాలెం, గదబపాలెం, బాలారం, డౌనూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం రేషన్ పంపిణీని సీడీపీవో, సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు. బీపీసీ సోమశేఖర్, సూపర్‌వైజర్లు బాలామణి, సునీత పాల్గొన్నారు.



హాజరు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని దారెల పంచాయతీ సర్పంచి, తెదేపా డివిజన్ నాయకులు పాండురంగస్వామి అన్నారు. శుక్రవారం పేటమాలిపుట్టులో పల్లె పండగ కార్యక్రమంలో కందకాల పనులకు తహసీల్దార్ నర్సమ్మతో కలసి శంకుస్థాపన చేశారు. పంచాయతీ కార్యదర్శి అరవింద్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. డుంబ్రిగుడ మండలం సొవ్వాలో పల్లె పండగ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ ఈశ్వరి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సర్పంచి సొయిత, తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, నేతలు స్వామి, ఆనంద్, చినగెన్ను పాల్గొన్నారు.

జి.మాడుగుల, గూడెంకొత్తవీధి, చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కిల్లంకోట పంచాయతీలో తెదేపా సీనియర్ నాయకుడు కె.భీంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి మాలన్న, ఎంపీటీసీ సభ్యుడు అప్పలరాజు, కూటమి నాయకులు రమేష్, జి.వెంకటరావు పాల్గొన్నారు. దేవరాపల్లిలో సర్పంచి సిరిబాల బుజ్జిబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, కూటమి నాయకులు రామకృష్ణ, శేఖర్, రాజుబాబు, రామారావు, రామరాజు, గోపాల్ పాల్గొన్నారు. లంబసింగి పంచాయతీ లబ్బంగిలో రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. చిన్నరాజబాబు, రామ్మూర్తి, సత్యనారాయణ రమణ పాల్గొన్నారు.

రంపచోడవరం, అడ్డతీగల, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' కార్యక్రమం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో సుండం శ్రీనివాసు దొర పేర్కొన్నారు. నడింవీధి గ్రామంలో సర్పంచి మంగా బొజ్జయ్య అధ్యక్షతన పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. ఏపీడీ శ్రీనివాసరావు, అడబాల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. గొండోలులో పలు అభివృద్ధి పనులను సర్పంచి రాఘవ శుక్రవారం ప్రారంభించారు. ఏపీవో అరవాలు, నిశాంత్ పాల్గొన్నారు.



పేటమాలిపుట్టులో పల్లె పండగలో పాల్గొన్న తహసీల్దార్, సర్పంచి తదితరులు

కూనవరం, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమం శుక్రవారం కూనవరం, కుమారస్వామి గూడెంలలో నిర్వహించారు. సర్పంచులు మల్లంపల్లి హేమంత్, సోందె రామయ్య, ఎంపీటీసీ సభ్యుడు బండారు సాంబశివరావు పాల్గొన్నారు.

గంగవరం, న్యూస్‌టుడే: ఎండపల్లి, ఇ.రామవరం గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, సర్పంచి రామలక్ష్మితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.



గంగవరం మండలం ఎండపల్లిలో ..

మట్టిలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలంలో గురువారం సాయంత్రం ఆర్టీసీ బస్సు మట్టిలో కూరుకుపోయింది. భద్రాచలం నుంచి కాకినాడ వెళ్తున్న కాకినాడ ఆర్టీసీ డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్సు మారేడుమిల్లికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని వాలమూరు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రహదారి మార్జిను దిగడంతో ఒక్కసారిగా మట్టిలో కూరుకుపోయింది. మన్యంలో క్రమం తప్పకుండా కురుస్తున్న వర్షాలకు నేలంతా చిత్తడిగా మారడంతో బస్సు మట్టిలో దిగిపోయి ఓ పక్కకు ఒరిగిపోయింది. దీంతో ప్రయాణికులంతా బస్సు దిగిపోయారు. మరో వాహనం సాయంతో బస్సును మట్టిలో నుంచి బయటకు లాగడంతో యధావిధిగా వెళ్లిపోయింది.



ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పీఎం జన్‌మన్ ద్వారా మంజూరైన గృహాలను త్వరగా నిర్మించుకోవాలని ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. దామనాపల్లి పంచాయతీ గొడుగు మామిడిలో శుక్రవారం పీఎం జన్‌మన్ గృహ నిర్మాణ గ్రౌండింగ్ మేళా కార్యక్రమాన్ని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. భూమిపూజ చేసి గృహ నిర్మాణాలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. పీఎం జన్‌మన్ ద్వారా మంజూరైన ఇంటికి రూ. 2.39 లక్షల నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. సర్పంచి కుందెరి రామకృష్ణ, ఈవోపీఆర్డీ పాపారావు, గృహనిర్మాణశాఖ ఏఈ సూరిబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ పడాల్, వెలుగు ఏపీఎం ఈశ్వరరావు, భాజపా నేత దుక్కెరి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

?: మారేడుమిల్లి నుంచి పందిరిమామిడికోట వెళ్లే రహదారిలో ఇరువైపులా తుప్పలు విపరీతంగా పెరిగిపోయి, రహదారిని మూసేస్తుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– కత్తుల సోమిరెడ్డి, పందిరిమామిడికోట

✓: పందిరిమామిడికోట వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూస్తాం.

– విజయ్‌కుమార్, ఈవోపీఆర్డీ, మారేడుమిల్లి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లిలోని మండల పరిషత్ కార్యాలయం పాత భవనం శిథిలస్థితికి చేరడంతో కార్యాలయాన్ని వేరే భవనంలోకి మార్చారు. ఈ పాత భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

– శివప్రసాద్, మారేడుమిల్లి

✓: కార్యాలయం పాత భవనంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు చేపడతాం. దీనిపై నిఘా ఏర్పాటుచేసి తగిన జాగ్రత్తలు తీసుకుంటాం.

– పి.రాము, ఎస్సై, మారేడుమిల్లి



వినియోగదారులపై భారం తగదు



చింతపల్లి విద్యుత్తు ఉప కేంద్రం ఎదుట సీపీఎం నాయకుల ఆందోళన

చింతపల్లి, కొయ్యూరు, న్యూస్‌టుడే: ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్తు వినియోగదారులపై అదనపు భారం మోపడం ప్రభుత్వానికి తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. శుక్రవారం చింతపల్లిలోని విద్యుత్తు ఉపకేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఎం నాయకులు ధనుంజై, చిరంజీవి పడాల్ పాల్గొన్నారు. కాకరపాడులో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు మాట్లాడుతూ.. ట్రూ అప్ ఛార్జీల పేరిట విద్యుత్తు బిల్లులు పెంచడానికి చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు పి.రాంబాబు, గంగరాజు, పెంటయ్యతో కలిసి సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు.



భీమవరంలో సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హుకుంపేట, అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీల పెంపు ఆలోచన విరమించుకోవాలని సీపీఎం మండల నాయకులు లింగమూర్తి పేర్కొన్నారు. హుకుంపేట సబ్ స్టేషన్ వద్ద పార్టీ నాయకులు ఆందోళన చేశారు. కృష్ణారావు, ఆనంద్, వెంకటరమణ, కనకరాజు పాల్గొన్నారు. అరకులోయలో సీపీఎం మండల కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రమేష్, రామన్న, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: రైతుల మోటార్లకు స్మార్టు మీటర్లు బిగించాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు భీమవరంలోని విద్యుత్తు ఉప కేంద్రంలో జేఈ రాజ్‌కపూర్‌కు వినతిపత్రం అందించారు.

గిట్టుబాటు ధరకే కాఫీ కొనుగోలు

అనంతగిరి, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: రైతులకు గిట్టుబాటు అయ్యే ధరలకే కాఫీ కొనుగోలు చేయనున్నట్లు జీసీసీ కాశీపట్నం బ్రాంచి మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. టోకూరు పంచాయతీలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. . ఇటీవల ప్రకటించిన కాఫీ ధరలను వివరించారు. వ్యాపారులకు విక్రయిస్తే తూకాల్లో మోసం జరిగి రైతులు నష్టపోతారన్నారు. సిబ్బంది అప్పన్నదొర, బలరాం, ముత్యాలు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. మొండిగెడ్డ పంచాయతీ గుడివాడలో మండల ఉద్యానాధికారిణి అరుణకుమారి రైతులకు అవగాహన కల్పించారు. జీసీసీ సేల్స్‌మెన్ హరి, గిరిజన రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మేనేజరు మురళీకృష్ణ